



# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 3 , ఆగస్టు ,2026


### శ్రీ దుర్గాదేవి జాతరలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ప్రత్యేక పూజలు

## ప్రజలందరికీ సుఖశాంతులు, ఆయురారోగ్యాలు కలగాలని

## అమ్మవారిని ప్రార్థించిన ప్రజాప్రతినిధులు

మంచిర్యాల, ఆగస్టు 2, ప్రభాతవార్త

హాజీపూర్ మండలం గడపూర్ శివారులోని ఎంసీసీ క్వారీలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గాదేవి జాతరలో మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, జిల్లా మాజీ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం జాతరకు విచ్చేసిన భక్తులను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్యమహేష్, కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూముల నరేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామగిరి బానేష్, ఉపాధ్యక్షుడు జాలే రాయలింగు, జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, వొడ్డె రాజమౌళి, కార్పొరేటర్లు, సర్పంచ్లు, ఉపసర్పంచ్లు, వార్డు సభ్యులు, నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలప్రాణాలకు విలువ లేదా..!

### బెల్లంపల్లి ఆశ్రమపాఠశాల ఫుడ్ పాయిజన్‌పై బిఆర్ఎస్వి అగ్నిగర్జన

బెల్లంపల్లి ఆగస్టు 02, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని ఎస్టి గిరిజన ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకున్న ఫుడ్ పాయిజన్ ఘటనపై బిఆర్ఎస్వి మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ఆగ్రహంతో మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల నిర్లిప్తత వల్ల అమాయక విద్యార్థులు ప్రాణాపాయ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థులను పరామర్శించిన బడికల శ్రావణ్. ఆశ్రమ పాఠశాలల దుస్థితిని చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం ఆహారం, చెత్త స్థాయి వంటశాలలు, కలుషిత తాగునీరు, వైద్య సదుపాయాల లేమి ఇవన్నీ కలిసి పిల్లల ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. పిల్లల ప్రాణాలు విలువలేనివిగా భావిస్తున్నారా?అని ప్రశ్నించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఆహార నాణ్యతపై కఠిన పర్యవేక్షణ చేపట్టి, బాధ్యులపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది నిర్లక్ష్యం కాదు.. ఇది ప్రభుత్వ వైఫల్యం! అంటూ ఘాటుగా విమర్శించారు. మిగతా 2లో..

## గోదారమ్మకు భక్తుల ప్రత్యేక పూజలు

భైంసా, ఆగస్టు 02, ప్రభాతవార్త:

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి క్షేత్రంలోని గోదావరి నదికి కిర్గుల్ (కె) గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నదిలోకి నూతన వరద నీరు వచ్చి చేరడంతో మహిళలు నైవేద్యాలు సమర్పించి, గంగ తెప్పలను నీటిలో వదిలారు. పంటలు సమృద్ధిగా పండాలని, పాడిపంటలతో గ్రామంలోని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని గోదారమ్మ తల్లిని వేడుకున్నారు. ఈ సందర్భంగా గోదావరి నది ఒడ్డున కొలువుదీరిన నందీశ్వర, హనుమాన్ విగ్రహాలకు గంగాజలంతో అభిషేకం చేశారు. అనంతరం సంప్రదాయం ప్రకారం నది ఒడ్డున విందు భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాసరలో రోడ్ల నిర్మాణానికి రూ. 27 కోట్ల నిధులు

### గోదావరి పుష్కరాల నేపథ్యంలో నిధుల మంజూరు


:

### ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసా, ఆగస్టు 02, ప్రభాతవార్త:



రానున్న గోదావరి పుష్కరాల సందర్భంగా బాసరలో భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం రూ. 27 కోట్ల నిధులను మంజూరు చేసిందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ వద్ద గల తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా ఓని నుంచి బాసర వరకు రోడ్డు మరమ్మతులకు రూ. 2.55 కోట్లు, గన్నోరా నుంచి ఓని వరకు రూ. 2 కోట్లు, పి.డబ్ల్యూ.డి. రోడ్డు నుంచి బాసర మహంకాళి ఆలయ రోడ్డుకు రూ. 1.20 కోట్లు, కిర్గుల్ (బి) నుంచి బాసర వరకు రోడ్డు అనుసంధానానికి రూ. 2.80 కోట్లు, బాసర రైల్వే స్టేషన్ నుంచి నావేగావ్ రోడ్డు వరకు రూ. 1.35 కోట్లు, మల్కాపూర్ మీదుగా బాసర వరకు రూ. 2.70 కోట్లు మంజూరైనట్లు వివరించారు. అలాగే ట్రిపుల్ ఐటీ నుంచి బాలాపూర్ రోడ్డుకు రూ. 45 లక్షలు, పెట్రోల్ బంక్ నుంచి శాంకరి స్కూల్ వరకు రూ. 45 లక్షల నిధులు కేటాయించారని చెప్పారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో బాసర ఆబాదీ నాలుగు లేన్ల రోడ్డు నుంచి పుష్కర ఘాట్ వరకు రూ. 8.50 కోట్లు, బిద్రేల్లి నుంచి ధర్మబాద్ వరకు రెండు లేన్ల రోడ్డుకు రూ. 4.65 కోట్లు, బాసర బస్ స్టాండ్ రహదారి మరమ్మతులకు రూ. 85 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. 2027లో జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పనులను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు.

## పిల్లల ప్రాణాలకు విలువ లేదా..?

(మొదటిపేజీ తరువాయి)



ఇంకా ఎంతమంది పిల్లలు అనారోగ్యానికి గురైతే ప్రభుత్వం మేల్కొంటుంది? బాధ్యులపై ఎందుకు చర్యలు లేవు? విద్యార్థుల ప్రాణాలతో ఆటలాడటమేనా పాల? అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఆహార నాణ్యతపై తక్షణం కఠిన పర్యవేక్షణ అమలు చేసి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. అలాగే, ఇటువంటి ఘటనలు పునరావృతమైతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు కొట్టే రాకేష్, యాసిన్, అంగూరి విజయ్, సుమంత్, అరుణ్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**సారంగాపూర్, ఆగస్టు 02, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసి పదవీ విరమణ పొందిన రవీందర్ గౌడ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో ప్రత్యేక వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రవీందర్ గౌడ్ దంపతులను గజమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ మహేందర్ మాట్లాడుతూ.. రవీందర్ గౌడ్ ఉపాధ్యాయ వృత్తిలో అంకితభావంతో సేవలు అందించారని కొనియాడారు. పేద, ధనిక తేడా లేకుండా విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య అందించాలనే సంకల్పంతో పనిచేశారన్నారు. విద్యార్థుల అవసరాలను సొంత అవసరాలుగా భావించి సహకరించే వారని తెలిపారు. క్రమశిక్షణ, కార్యదీక్షత కలిగిన మంచి ఉపాధ్యాయుడికి వీడ్కోలు పలకడం విచారకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇక్బాల్ అహ్మద్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి



**భైంసా, ఆగస్టు 02, ప్రభాతవార్త:**

భైంసా పట్టణంలోని నయాబాదీ నివాసి, రెండవ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి ఇక్బాల్ అహ్మద్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి ఆదివారం వారి నివాసానికి వెళ్లారు. ఇక్బాల్ అహ్మద్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. మాతృమూర్తి మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తానూర్ మాజీ జడ్పీటీసీ ఉత్తమ్ భలేరావు, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఫరూఖ్, సయ్యద్ అల్లా, ఖలీద్ ఖాన్, గైక్వాడ్ సాయినాథ్ (ధురి), కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ముల్కలపేటలో వింత ఘటన..

## ఎనిమిది కాళ్లతో మేకపిల్ల జననం

**వేమనపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త**



వేమనపల్లి మండలం ముల్కలపేట గ్రామంలో ఆదివారం అరుదైన ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొద్దన శంకర్ ఇంట్లో పెంచుతున్న మేక రెండు ఆడ మేకపిల్లలకు జన్మనిచ్చింది. వాటిలో ఒకటి సాధారణంగా జన్మించి ఆరోగ్యంగా ఉండగా, మరో మేకపిల్ల మాత్రం ఎనిమిది కాళ్లతో జన్మించడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. అసాధారణ శారీరక నిర్మాణంతో పుట్టిన మేకపిల్లను చూసిన కుటుంబ సభ్యులు మొదట ఆశ్చర్యానికి లోనయ్యారు. అనంతరం విషయం గ్రామమంతా వ్యాపించడంతో వింత మేకపిల్లను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆసక్తిగా తిలకించారు. పలువురు తమ సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. అయితే, జన్మించిన కొద్దిసేపటికే ఎనిమిది కాళ్లతో పుట్టిన మేకపిల్ల మృతి చెందగా, మరో మేకపిల్ల పూర్తిగా ఆరోగ్యంగా ఉందని యజమాని కొద్దన శంకర్ తెలిపారు. ఈ వింత ఘటనపై గ్రామస్తులు వివిధ అభిప్రాయాలు వ్యక్తం చేస్తుండగా, పశువైద్య నిపుణులు మాత్రం గర్భంలో పిండం ఎదుగుదల సమయంలో ఏర్పడే జన్యుపరమైన లేదా అభివృద్ధి లోపాల వల్ల ఇటువంటి అసాధారణ శారీరక వైకల్యాలు అరుదుగా సంభవిస్తాయని పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి ఘటనలు అత్యంత అరుదుగా చోటుచేసుకుంటుండటంతో ముల్కలపేటలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. పరిసర గ్రామాల ప్రజలు కూడా వింత మేకపిల్ల గురించి తెలుసుకుని సంఘటన స్థలానికి చేరుకుని ఆసక్తిగా పరిశీలించారు.

### పెండింగ్ స్కాలర్‌షిప్ బకాయిల విడుదలకు విద్యార్థుల గళం

## ఆగస్టు 6 మహాధర్నాను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ పిలుపు




**మంచిర్యాల, ఆగస్టు 2, ప్రభాతవార్త**

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దాగం శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంచిర్యాలలో నిర్వహించిన టౌన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 6న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాలో జిల్లాకు చెందిన విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ప్రైవేట్ కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి, విద్యార్థుల సర్టిఫికెట్లు నిలిపివేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జిల్లా సహ కన్వీనర్ విష్ణు ప్రసాద్, కార్తీక్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏసీసీ క్వారీ జాతరలో దుర్గాదేవి అమ్మవారిని దర్శించిన బీజేపీ నాయకులు

**మంచిర్యాల, ఆగస్టు 2, ప్రభాతవార్త**



మంచిర్యాల ఏసీసీ క్వారీ జాతర సందర్భంగా దుర్గాదేవి అమ్మవారిని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ముఖేష్ గౌడ్‌తో పాటు పార్టీ కార్పొరేటర్లు, నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. జాతర ఉత్సవాల్లో పార్టీ నాయకులు పాల్గొని భక్తులతో కలిసి అమ్మవారి ఆశీస్సులు పొందారు.

### వేమనపల్లి గ్రంథాలయానికి కుర్చీలు, పుస్తకాల విరాళం

## త్వరలో వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు:

### ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణుకుంట్ల ప్రవీణ్

**వేమనపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త**



మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు రేణుకుంట్ల ప్రవీణ్ కుర్చీలు, పుస్తకాలను విరాళంగా అందజేశారు. ఆదివారం గ్రంథాలయాన్ని సందర్శించిన ఆయన ముందుగా గ్రంథాలయ ఆవరణలో మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రంథాలయంలోని వసతులను పరిశీలించి, అక్కడ చదువుకుంటున్న విద్యార్థులు, పాఠకులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన కేంద్రాలుగా నిలవాలని, ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు త్వరలోనే గ్రంథాలయంలో వాటర్ ప్యూరిఫైయర్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. గ్రంథాలయ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో తన వంతు సహకారం నిరంతరం కొనసాగుతుందని, భవిష్యత్తులో మరిన్ని పుస్తకాలు, ఇతర అవసరమైన సామగ్రిని కూడా అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రేణుకుంట్ల ప్రవీణ్ అందించిన కుర్చీలు, పుస్తకాలతో గ్రంథాలయాన్ని వినియోగించే విద్యార్థులు, పాఠకులకు ఎంతో ఉపయోగం కలుగుతుందని గ్రంథాలయ సిబ్బంది పేర్కొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి సహకరిస్తున్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే క్షేత్రస్థాయి సమీక్ష

**మంచిర్యాల, ఆగస్టు 2, ప్రభాత వార్త**



నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భారీ వర్షాలకు దెబ్బతిన్న ఏసీసీ క్వారీ, రాళ్లవాగు వంతెనలను సందర్శించి పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తకుండా త్వరితగతిన వంతెనలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించేందుకు నిర్మిస్తున్న కేంద్రీకృత వంటశాల పనులను పరిశీలించారు. ఆహార తయారీ, పరిశుభ్రత, నిల్వ, ప్యాకింగ్, పంపిణీ వ్యవస్థలను సమీక్షించి ప్రతి విద్యార్థికి పోషక విలువలతో కూడిన నాణ్యమైన ఆహారం అందేలా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. తర్వాత కాలేజీ రోడ్డులో నిర్మాణంలో ఉన్న నూతన ప్రభుత్వ ఆసుపత్రి పనులను పరిశీలించి, నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు, విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం, దెబ్బతిన్న మౌలిక వసతుల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్, సంబంధిత శాఖల అధికారులు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవ వారోత్సవాలను విజయవంతం చేయాలి

**వేమనపల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త**

తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం (ట్యాగ్) ఆధ్వర్యంలో ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా నిర్వహించే వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎర్ర పున్నం పిలుపునిచ్చారు. వేమనపల్లి మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 6న మండల కేంద్రంలో జరిగే కార్యక్రమానికి ఆదివాసీలు, రైతులు, విద్యార్థులు, యువత, మేధావులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అలాగే గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు, అవగాహన సభలు నిర్వహించి ఆదివాసీ దినోత్సవ స్ఫూర్తిని చాటాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బాగాల రాజన్న, మర్శుల మల్లేశ్వరి, కొండపల్లి వెంకన్నతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయండి

**ఆసిఫాబాద్ టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త :**




సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభను విజయవంతం చేయాలని టీఆర్ఎస్ పార్టీ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ కిరీమిల్ల వినోద్ చారి, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కావేటి సబితా మనోహర్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సామాజిక న్యాయం, తెలంగాణ అభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు సహా అన్ని వర్గాల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, రాజకీయ సాధికారత వంటి కీలక అంశాలపై టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఆగస్టు 6న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ సంకల్ప సభలో విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి టీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు, రైతులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# వైభవంగా పెద్దమ్మ తల్లిబోనాలు

**తాండూర్, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం టోన్ షిప్ లో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి బోనాలు ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పులతో మహిళలు సాంప్రదాయ బద్దంగా బోనాలు నెత్తిన ఎత్తుకొని పోచమ్మ, పెద్దమ్మ ఆలయాల వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం పోచమ్మ, పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించి అందరిని చల్లగా చూడాలని పూజలు చేసి మొక్కులు చెల్లించారు.



# మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించిన 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య



**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



ఆషాఢ బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ ప్రాంతంలో కొలువైన శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8వ వార్డు కౌన్సిలర్ గజ్జల లావణ్య, ఆసిఫాబాద్ జిల్లా మున్నూరు కాపు సంఘం పటేల్స్ జిల్లా అధ్యక్షుడు గజ్జల లక్ష్మణ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ పరిసరాల్లో నిర్వహించిన బోనాల వేడుకల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా గజ్జల లావణ్య, గజ్జల లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

# మాదారంలో గోరింటాకు సంబరాలు

**తాండూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త :**

మండలంలోని మాదారం శ్రీ కోదండ రామాలయంలో ఆదివారం మహిళలు గోరింటాకు సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయపద్ధంగా పూజలు చేసి గోరింటాకు పెట్టుకొని ఆనందోత్సవాల మధ్య సంబరాలు జరుపుకున్నారు.



# మహాంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన

## కొత్తపల్లి అనిత-శ్రీనివాస్ దంపతులు

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలో కొలువైన శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత–డా. కొత్తపల్లి శ్రీనివాస్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ మహంకాళి అమ్మవారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంకి ంచారు. కాగజ్‌నగర్ పట్టణ ప్రజలంతా సుఖసంతోషాలతో, ప్రశాంతంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.



# కాగజ్‌నగర్‌లో తెలంగాణ మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం

## ...ఎస్టీ హోదా సాధనకు ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిరసనపై కీలక చర్చ

**కాగజ్‌నగర్ రూరల్, ఆగస్టు 2 ప్రభాతవార్త :**



మాలి కులానికి ఎస్టీ హోదా కల్పించాలనే డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న నిరసన, ధర్నా కార్యక్రమాలపై తెలంగాణ మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కాగజ్‌నగర్ మండలం తిలక్‌నగర్‌లోని బీసీ భవన్‌లో ఆదివారం రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లేండుగూరి శ్యామ్‌రావు, ఈ సందర్భంగా మాలి కులానికి ఎస్టీ హోదా సాధన కోసం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై నాయకులు చర్చించారు. ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మాలి సంఘ సభ్యులను చైతన్యపరచాలని నిర్ణయించారు. ప్రతి జిల్లా నుంచి అధిక సంఖ్యలో సభ్యులు ఢిల్లీ కార్యక్రమానికి హాజరయ్యేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి హాజరైన ప్రతినిధులు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఎస్టీ హోదా సాధనే లక్ష ్యంగా సంఘం సభ్యులంతా ఐక్యంగా పనిచేయాలని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సమావేశంలో తీర్మానించారు. అదేవిధంగా రానున్న రోజుల్లో నిర్వహించనున్న కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, ప్రజా చైతన్య కార్యక్రమాలు, ఢిల్లీలో చేపట్టనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసంతరావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మోర్లే మొండి, జిల్లా ప్రధాన కార్యదర్శి వడుగూరి సాయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర కమిటీ సభ్యులతో పాటు వివిధ జిల్లాలు, మండలాలు, గ్రామాల నుంచి సంఘం నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.